

# ఎక్కడ స్త్రీలు పూజింపబడతారో!

'హరిప్రియ'

అందమైన నీరెండ గన్నేరు చెట్ల నందుల్లోంచి కింద వెలుగు నీడల ముగ్గులు వేస్తోంది.

"బామ్మా..."

తలతిప్పాను. హరిచేతిలో పేపరు పెన్నూ పట్టుకుని నిలుచుంది.

"ఎల్లుండి మా స్కూల్లో వ్యాసరచన పోటీబామ్మా... ఏవన్నా పాయింట్సు చెప్పవూ."

హరి నా మొదటి మనుమరాలు. ఆరో ప్రాణం. దాని నవ్వులో భవిష్యత్తు వెతుక్కుంటాను నేను.

"విషయం ఏమిటమ్మా?" దగ్గరకు లాక్కుంటూ అడిగాను.

"ఎక్కడ స్త్రీలు పూజింపబడతారో అక్కడ దేవత లుంటారు అంటే ఏమిటిబామ్మా."

"ఏడో తరగతి చదువుతున్న హరికి, పదుకొండేళ్ల పసిదానికి మన దేశం సంస్కృతీ, నాగరికతా, పతివ్రత లూ, ఝాన్సీరాణి శౌర్యం, దుర్గాబాయి ధైర్యం—ఇవన్నీ వీలయినంత తేలిక భాషలో చెప్పటానికి ప్రయత్నిస్తు న్నాను.

"అమ్మాయ్ జానకమ్మా..." అనే పిలుపు వినపడింది.

"రా పార్వతీ... కులాసాగా ఉన్నావా... పిల్లలు ఎలా ఉన్నారు?"

నాకంటే ఏ పదిహేనేళ్లోచిన్న వయసుకి మించిన వార్ధక్యం. దారిద్ర్యంపంచిన అనుభవాలతో గుంటలు పడ్డ కళ్లు.

"ఎప్పుడొచ్చావక్కా. సెలవలా? జానకమ్మ ఉందా?"

జానకితోనే పార్వతికి ఎక్కువ చనువు. నన్ను చూస్తే ఏదో భయం. దాని ప్రాణానికి నేను చేసేదేదో పెద్ద ఉద్యోగం—నా యెదుట తలెత్తి మాట్లాడదు.

"జానకి లోపలుంది వెళ్లు" అన్నాను.

"రాత్రికి చెప్పుదువు గాని బామ్మా... స్కూలు టైం అవుతోంది. జడవెయ్యి."

లోపలికి వచ్చాను. కళ్లు తుడుచుకుంటూ గొంతు నొక్కుకుని ఏదో చెబుతోంది పార్వతి. కూరతరుగుతూ వింటున్నది జానకి. ఏమిటని అడగలేదు నేను.

కాసేపటికి దిగులుగా వెళ్లిపోయింది పార్వతి. తరిగిన కూరను అందిస్తూ జానకి నెమ్మదిగా "విన్నారా... రత్నం నెలతప్పిందిట... అందరూ కాకుల్లా పొడుస్తున్నారుట. రాత్రి నూతిలో పడతానని ఒకటే గోలట..."

"ఎక్కడ స్త్రీలు పూజింపబడతారో..." హరికి చెప్పాల నుకున్న పాయింట్సు మనసులో మెదులుతున్నాయి కాబోలు ఇంకా... బయటికి అనేశాను.

వింతగా చూసింది జానకి.

రత్నం అంటే పార్వతిగారి మూడో అమ్మాయి.

గుర్తుకి వచ్చింది. కిందటి వేసవి కాలం సెలవులకు నేను వచ్చినప్పుడు... ఏదో పొగలాగా...

"మా మూడో అమ్మాయి రత్నానికి పెళ్లికుదిరిందక్కా జానకమ్మ కొత్త చీరకొని పెట్టి వందరూపాయలిచ్చింది. చిన్న పిల్లయినా బుద్ధి పెద్దది."

సూచన నాకు అర్థం అయింది. పెట్టె తీసి నేనూ ఏదో తోచింది ఇచ్చాను.

'అండగానిలిచే నాధుడు లేకపోయినా ఏదో బండి లాక్కొని వస్తున్నది' అని తృప్తిపడ్డాను.

పార్వతి మొగుడు ఏం చేసేవాడో నాకు తెలీదు. కాని వంశాన్ని ఉద్ధరించే మగ నలుసుకోసం ఆరుగురు అమ్మాయిలను మాత్రం అవలీలగా కనిపారేశాడు. ఏదో వాడు వంశాంకురం మగమొలక పుట్టిన తరువాత తన పని అయిపోయిందని కాబోలు అర్థంటుగా మరో లోకంలోకి వెళ్లిపోయాడు.

వచ్చళ్లు పెట్టి ఇచ్చి, వంటలు చేసి, అప్పడాలు వడియాలు లాంటివి అమర్చి పెట్టి—నోటి మంచిత నంతో సంసార రథం లాగుతున్నది పార్వతి.

ఇంతా అంతా పిల్లలూ.... పడిపోతున్న పెంకుటి ల్లూ... బావగార్లతో తగువులూ... మిగిలిన పార్వతి.

మన సంస్కృతిలో స్త్రీల ఔన్నత్యం గురించి ప్రాచీన గాథల్లోని ఉదాహరణలు చెప్పుకుని మురిసిపోవడమే ఆనవాయితీగా వస్తోంది. కానీ నమకాలీన సమాజంలో నగటు స్త్రీ అనుక్షణం పురుషాహంకారానికి బలైపోతున్నది. ఈ దారుణం ఎప్పటికీ అలా కొనసాగవలసిందేనా? లేక....?

ఆ పనీ ఈ పని చేయించుకుని, తృణమో పణమో ముట్టచెపుతూ ఉంటుంది మా కోడలు. ఎవరికో ఎలాగో చెప్పించి ఇద్దరు అమ్మాయిల్ని హాస్టల్‌లో చేర్పించింది.

పెద్ద పిల్లలిద్దరికీ ఎలాగో పెళ్లి అయిందనిపించింది పార్వతి.

పెద్దల్లుడు ఆటోరిక్షా నడుపుకుంటున్నాడు హైదరాబాదులో. రెండోవాడు గుంటూరులో ఏదో ఆఫీసులో అంటెండరుగా కాబోలు పనిచేస్తున్నాడు. ఏదో వాళ్ల బతుకు వాళ్లు బతుకుతున్నారు.

ఇప్పుడు మూడో పిల్ల పెళ్లి!

"అల్లుడేం చేస్తున్నాడు పార్వతీ?"

"కాటవ్రరులో నాలుగెకరాల పొలం ఉందమ్మా. పెద్ద మండువా ఇల్లూ... హోమియో వైద్యం చేస్తుంటాడుట. ఏదో పాడీ పంటా ఫరవాలేదమ్మా... రెండో పెళ్లి గాని పిల్లవాడు చిన్నవాడే. పిల్లలూ లేరు."

విని ఏం చేస్తాను గనుక... నలుగురూ చేరారు. గుళ్లో ఇద్దరి నెత్తినా నాలుగు అక్షింతలు వేశారు. చేతులు దులుపుకున్నారు.

నేను సెలవులయిపోయి వెళ్లేరోజున గాబోలు ఇద్దరినీ మా ఇంటికి తీసుకొని వచ్చింది పార్వతి.

చామన చాయా. నవ్వేకళ్లూ... పొడుగాటి జడా. కొత్తచీరా... కొత్త వెండి పట్టా గొలుసులతో పసుపుతో పచ్చగా మెరుస్తున్న పాదాలు. సిగ్గుతో ఒరిగిన తలా... ఈ రూపమే జ్ఞాపకం ఉంది.

అల్లుడు చిన్నవాడే... చూడటానికి బాగున్నాడు. మాటలే నాకు నచ్చలేదు.

"మీరు అప్పుడే వెళ్లిపోతున్నారా? మా ఊరోసారిరారూ... అయినా బస్తీ వాళ్లు మీరెక్కడొస్తారు? మేము మీ ఊరువస్తామండోయ్..." పెద్దదాన్ని అని అయినా చూడకుండా ఏమిటో అర్థం పర్థం లేని మాటలూ, అనవసరమైన నవ్వూ చిరాకు పుట్టించింది. మనస్సు చివుక్కుమంది.

'సరేలే. ఇలా అనుకుంటే నూటికి తొంభైమంది ఆడపిల్లలకు పెళ్లిళ్లేకావు. వంకలు బాగానే పెట్టవచ్చు' అంటూ మనసుని కొప్పడి లోపలికి అణిచి వేశాను.

సంవత్సరం కిందటి మాట. జ్ఞాపకాల తలుపులు తెరచుకుంటున్నాయి.

• • •

దసరా సెలవులకు నేనిక్కడికి రాలేదు. మా పిల్లలే నా దగ్గరికి వచ్చారు. ఏదో మాటల సందర్భంగా జానకి అంది.

పార్వతి మూడో కూతురు రత్నం కాపురం అధ్వాన్నం అయిపోయింది. చక్కనివాడనీ, ఆస్తిగలవాడనీ మురిసిపోయి ఇచ్చిందిట గాని అతనికి లేని చెడ్డగుణం లేదుట. పైగా ఈ పిల్లమీద చచ్చే అనుమానంట. నెలతిరక్కుండానే అక్కడ నిల్చున్నావనీ వాడి వంకచూశావనీ కాల్చుకుతినేవాడుట. తల్లి దగ్గరకు వచ్చి చెప్పుకుంటే మళ్లీ బుద్ధులు చెప్పి దించివచ్చేదిట. చివరకు ఓ రోజున చేతిలోని పెద్దచెంబో ఏదో విసిరి వేశాడుట. తలపగిలి కుట్లు కూడా వేయాల్సి వచ్చిందిట. అత్తగారే పార్వతికి కబురుచేసి "మీ అమ్మాయి బతకాలంటే మీ యింటికి తీసుకొనిపొండి. ఈ ఘోరం నేను చూడలేకుండా ఉన్నాను. ఆ కాస్త ప్రాణం గుటుక్కుమన్నదా అంటే వాడితో పాటు నేనూ జైల్లో కూర్చోవాలి. ఎన్ని వినటం లేదు గనక" అని పంపించింది.

ఏముందీ కథ పునరావృతం. నయమే ఇంకా. అత్తగారూ కొడుకు కలిసి ప్రాణం తీసెయ్యలేదనుకున్నాను.

విని వినీ ఈ కథలు విసుగువస్తోంది. ఎలాగో పెళ్లి అయితే చాలనుకుంటారేమిటి? ఇలా పెళ్లిళ్లు చేస్తే సమస్యలు పెరుగుతున్నాయా? తరుగుతున్నాయా? ఎప్పటికి వదులుతుంది ఈ మూర్ఖత్వం?

అంతవరకూ తినో తినకో కాలం గడిపే వాళ్లు పార్వతీ పిల్లలూ. ఇప్పుడు రెండురోజుల కొకసారి అల్లుడుగారు వచ్చి నానా గోల చేయటం... ఇరుగూపొరుగూ గొంతులు నొక్కుకోవటం... తక్కిన పిల్లలు అక్కగారి మీద చిరాకు పడటం... ఆ రత్నం బతుకు దుర్భరం అయింది.

జానకి చేత చెప్పించాను—"ఆ పిల్లను నా దగ్గరకు పంపించు. ఇంత దూరానికి రానూలేడు. వచ్చినా స్థానబలంలేదు. ఏమన్నా ఇంకా గోల చేస్తే నాకర్రతో బుద్ధి చెప్పిస్తాను. ఆ పిల్లకు చదువో కుట్లో నేర్పిస్తాను. లేకపోతే ఎక్కడన్నా హోమ్‌లో చేరుస్తాను"—అని.

కూటికి లేకపోయినా పరువనే పేరుతో ప్రాణాలు తీసుకుంటారు. 'పెళ్లయిన పిల్ల ఊరుదాటితే ఏమన్నా ఉందా!' వీళ్ల ఆలోచనా ధోరణి ఎప్పటికి మారుతుంది?

ఎదురుగుండా పంపులోంచి ధారగా పడే నీళ్లను చూస్తున్నాను.

'ఎక్కడ స్త్రీలు పూజింపబడతారో అక్కడ....'

"మీకు వంట్లో బాగాలేదా?" అంటోంది జానకి. తన చేత 'అత్తయ్యా' అని పిలిపించుకోవాలన్న కోరిక ఇప్పటికీ ఎప్పటికీ అలాగే వుంది.

వెర్రిగా నవ్వాలనిపించింది.

మధ్యాహ్నం పొద్దువాలుతోంది. చైత్రమాసం ఎండలు ఇంకా బాగా ముదరలేదు. ఎవరూ వినిపించుకోకపోయినా అక్కడొక్కటీ ఇక్కడొకటీ కోయిలలు కూస్తూనే ఉన్నాయి పాపం.

ఎదురుగా ఎర్రని ఇసకనేల.

గోడమీద ముదురు నీలం రంగు చీరలో ఇందిరా గాంధి ఫోటో. ఆ ఫోటో అంటే నాకెంతో ఇష్టం. మహిళా రూపంలో ఉన్న పౌరుషం.

ఏదో చెయ్యాలి?

చెప్పులేసుకుని బయలుదేరాను. పార్వతి గారిల్లు కొంచెం దూరమే. వాకిలంతా పరుచుకొని ఉన్న బాదం చెట్టు. గడపదగ్గర చెంగు పరచుకొని ముడివగ్గులా పడుకొని ఉంది పార్వతి. గోడకు ఆనుకుని కూర్చుంది రత్నం. ఆశలేని ముఖం. అంత చిన్న వయసులోనే ఎన్నో అనుభవాల కడలిలో ఈది అలసిపోయిన కళ్లు.

నన్ను చూసిలేచింది. అంతనైరాశ్యంలోనూ ఏదో ముగ్ధత్వం.

అడిగాను. బుజ్జగించాను. కోప్పడ్డాను. చివరికి బెదిరించాను.

రాయిలాంటి మనసు కదిలింది. మాటల్లో ఏ స్పందనా పలకదు.

నాలుగైదు నెలల కిందట వచ్చిన బావగార్లు అతను ఇంటికి వచ్చినా, రత్నాన్ని ఏమన్నా అన్నా జైల్లో పెట్టిస్తామని భయపెట్టి వెళ్లిపోయారుట.

ఒక నెలరోజులు అయినా ఆనవాలూ లేదు. ఇంక రావటం లేదనే అనుకుంటున్నారందరూ. ఏ హక్కు వదులుకున్నా మెళ్లోతాళిగట్టిన హక్కు వదులుకోదలుచుకోలేదు అతను. తల్లి ఏ పంటలకో పోయినప్పుడు, చెల్లెళ్లు స్కూలుకి వెళ్లినప్పుడు వచ్చి తన అధికారం అమలుపరుచుకొనేవాడు.

తరతరాలుగా జీర్ణించిన సంప్రదాయం. అట్టలు కట్టిపోయిన పతివ్రతల కథలు. అన్నిటినీమించి ఏమీ చెయ్యలేని నిస్సహాయతా—రత్నం నోరు నొక్కేశాయి. ఆ కాసేపటి లాలనతో సుఖాన్ని ఇచ్చినా ఇవ్వకపోయినా సమస్యల ముళ్లవలయంలో ఇరుక్కునేటట్లు చేసింది!

ఇప్పుడు ఉలకడు—పలకడు ఆ ప్రబుద్ధుడు.

నాకూ దానికీ ఏనాడో సంబంధం తెగిపోయిందంటూ బాజావాయిస్తున్నాడు.

ఏ చట్టం అతన్ని శిక్షిస్తుంది? ఏ న్యాయం రత్నానికి అండగా నిలుస్తుంది?

స్త్రీలూ—ఆస్తిలో హక్కు—విడాకులు—ఆర్థిక స్వాతంత్ర్యం... ఈ మాటలు ఎంత నవ్వుల పాలవుతున్నాయి!

ప్రాణంలేని ఇటుకలు—మనకే నమ్మకంలేని వట్టి మాటల పోగులు.

రెక్కలు ముక్కలు చేసుకొని—సుఖమూ విశ్రాంతి అనే మాటలకు అర్థమే తెలియక మూర్ఖత్వపు ఊబిలో చిక్కుకుని—మొగుడి పిచ్చిభావాలకి బలై—ఒక్కో పిల్లనే వదిలించుకొని బరువు దింపుకోవాలని తహతహలాడే తల్లి ఏంచేస్తుంది?

నిండా పాతికేళ్లు లేకుండా చదువూ సంధ్యాలేక మోడులాగా ఏడుగురు పిల్లలతో వీధిన పడి బతుకు పోరాడి విసిగిపోతున్న ఆడది.

ఆమె మహిళకాదు. తరుణికాదు. వట్టి ఆడది.

పాదాలు కిలో బరువుతో కుంగిపోతుంటే తిరిగివచ్చాను.

అరు బయట మంచం మీద కూర్చుని పూలు గుచ్చుకుంటున్నది జానకి. పిల్లలు గోలగా అరుస్తూ

అడుకుంటున్నారు. అవురావురుమనే పిల్లల కోసం గూటికి తిరిగి వస్తున్నాయి పిట్టలు. ఆ పిట్టల వెచ్చని రెక్కల కింద ముడుచుకొని హాయిగా నిద్రపోతాయి పిల్లలు. బుద్ధి వుందనుకుంటున్న మనుమలం—మన పిల్లలను ఇవ్వగలుగుతున్నది ఏమిటి?

గునగునలు వినివస్తున్నాయి.

"అమ్మేమిటీ? అలా ఉంది? మీరిద్దరూ ఏమన్నా మాటా మాటా అనుకున్నారా?"

"నరేలెద్దురూ... మీకు అన్నీ అనుమానాలే... మీ ఉద్దేశంలో నేనుత్త గయ్యాళినికాబోలు..."

తరువాత వినిపించుకోలేదు.

గిన్నెల చప్పుళ్ళు... టి.వి.లో పాటలు.

'ఎవరో వస్తారని... ఏదో చేస్తారని.. ఎదురు చూసి మోసపోకు...'

నిన్ను నీవే ఉద్ధరించుకోవాలి.

ఎలా... ఎలా... ఎలా.

ఏదో గుర్తుకి వచ్చినట్లు తీరికగా పడుకుని ఉన్న కుక్క లేచి మొరగటం మొదలు పెట్టింది.

హారి వచ్చి మెడచుట్టేసింది.

"బామ్మా... మరిచిపోయావా?"

"ఏమిటిరా?"

"పొద్దున్న నేనడిగిన పాయింట్సు"

"వద్దమ్మా.. ఆ వ్యాసం అలాకాదు... నేను చెప్పినట్లు రాయి."

"ఏమిటిబామ్మా..."

"అవును తల్లీ... 'స్త్రీలను ఎవరూ పూజించవద్దు. గౌరవించనూవద్దు. ఆరాధించనూ వద్దు. వట్టి ఎముక లూ, రక్తమూ మాంసమేకాకుండా కాస్త మనసు కూడా ఉన్నదని గుర్తుంచుకోండి. అదిచాలు...' అని చెప్పుతల్లీ"

'ఏమిటి బామ్మా... వాటార్యూ టాకింగ్."

"హారి తల్లీ... పెద్దయిన తరువాత నువ్వేం చేస్తావురా!"

"నువ్వే అన్నావుగా నేను పైలట్‌ని కావాలని."

"అవునురా హారీంద్రా మీరంతా పైలట్లుకండి. కలెక్టర్లు కండి... లేకపోతే ప్లైలర్లు, ప్యూన్లు ఏమయినా సరే ఆడవాళ్ళం అని మాత్రం జ్ఞాపకం ఉంచుకోకండి. పరిస్థితులు ఎదురు తిరిగితే మీరూ ఎదురు తిరగండి. దద్దమ్మల్లా ఏడుస్తూ కూర్చోకండి. నీడనిచ్చి తోడుగా ఉండేవాడే మొగుడు. మగవాడు. లేకపోతే వాడూ ఆడదే."

అర్థంకాకుండా పిచ్చి చూపులు చూసే హారిని గుండెలకు అదుముకుని, పోట్లాడి అయినా రత్నాన్ని వట్టి ఆడదానిగా మిగలనీయకూడదని మనసులో ప్రతిజ్ఞచేసుకుంటూ కళ్ళు మూసుకున్నాను. □

# వీరనారీమణులు

## రాణీమంగమ్మ

తమిళదేశాన్ని పరిపాలించిన ఆంధ్ర వీరనారీమణి రాణీరంగమ్మ. ధైర్యసాహసాలకు మారు పేరు. రాజకీయనేర్పరి. తన రాజ్యాన్ని శత్రువులకు చిక్కకుండా కాపాడటమే కాక, దాన్ని విస్తరింపచేసింది కూడా. కాలానుగుణంగా ప్రవర్తించి తనకూ, తన ప్రజలకు వచ్చిన చిక్కులను తొలగించిన ప్రజ్ఞావంతురాలు ఈమె.

మంగమ్మ రాజధాని మధుర. ఈమె చంద్రగిరి రూవకల్‌కు చెందిన తుపాకుల లింగమ్మ నాయకుని కుమార్తె. ఆమె భర్త పేరు చొక్కనాథనాయకుడు. ఈ దంపతులకు పుట్టినవాడు మూడవ ముద్దు వీరప్పనాయకుడు. దురదృష్టవశాత్తు వీరప్పనాయకుడి బాల్యంలోనే చొక్కనాథనాయకుడు మరణించాడు.

రాణీమంగమ్మ ఒక పక్క పతివియోగం, మరోపక్క కర్తవ్యదీక్షతో సతమతమైపోయింది. అందువల్ల ఆ కాలంలో మూఢాచారాలను ఎదిరించి సతీసహగమనం చెయ్యక తన కుమారునకు పట్టాభిషేకం చేసింది. అప్పుడు అతనికి వయసు 8 సంవత్సరాలు. ఆపై అతనికి ముద్దమ్మతో వివాహం చేసింది. కాని అతడూ యవ్వనంలోనే మరణించాడు. అప్పుడు అతని భార్య ముద్దమ్మ గర్భవతి.

సహగమనం చెయ్యబోతున్న కోడలిని వారించి పుట్టిన బిడ్డకు విజయరంగముద్దు చొక్కనాథుడని పేరు పెట్టి పిలిచింది. అందరికీ ఆశ్చర్యం కలిగేలా ఆ శిశువుకు 3 నెలలోనే రాజ్యపట్టాభిషేకం చేసింది.

మధురకు సామంతుడయిన తిరువాన్కూరు (కేరళ) ప్రభువు రవివర్మ ఎదురు తిరగగా మంగమ్మ అతనిపైకి దండెత్తి అతడ్ని అణిచివేసింది. తంజావూరు రాజు శాహాజీ మధుర రాజ్యంలోని కొన్ని ప్రాంతాలను ఆక్రమించేసరికి మంగమ్మ అతనిపై దాడికి తరలివెళ్ళి బుద్ధి చెప్పింది! ఆ యుద్ధంలో తంజావూరుకు తీవ్ర నష్టం కల్గింది. శాహాజీ భయపడి సంధికి సిద్ధపడ్డాడు. మధురకు సామంతుడైన రామనాథపుర రాజు ఎదురు తిరిగి మధురను ముట్టడించినపుడు ఈమె అతడ్ని చిత్తుగా ఓడించింది.

మంగమ్మ స్నేహానికి ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చిందని చెప్పాలి. మొగల్ చక్రవర్తులు తనకు గౌరవం ఇచ్చినంతవరకు వారితో సఖ్యంగానే ఉండేది. మొగల్ సేనాని జుల్‌ఫికర్‌ఖాన్ దక్షిణ ప్రాంతానికి వచ్చినప్పుడు అతను తన దేశానికి తీసుకొని వెళ్ళలేనన్ని కానుకలను ఇచ్చి తన ఔన్నత్యాన్ని చాటింది.

ఒక వైపు మొగల్ ప్రభుత్వం, ఒకవైపు మైసూరు రాజ్యం, మరొకవైపు తంజావూరు, ఇంకొక వైపు తిరువాన్కూరు. మరింకోవైపు రామనాథపుర అరవరాజులు; తనకు విరోధంగా వున్న కాలములో మధుర రాజ్యం ఎంతో సుభిక్షంగా వుందంటే దానికి కారణం రాణీమంగమ్మ చతురత, ధైర్యసాహసాలే!

మంగమ్మ అన్ని మతాలవారిని సమానంగా చూసింది. గుడులకు, గోపురాలకే కాక చర్చిలకు, మసీదులకు కూడా సహాయం చేసింది. సహగమనపు దురాచారాన్ని కొంతవరకు రూపు మాపింది. లలిత కళలను పోషించింది.

పండిన చెట్టుపైనే పదిరాళ్ళు పడతాయి అన్నట్లు మంగమ్మ కీర్తికి ఓర్వలేక కొందరు ఆమె శీలాన్ని శంకించడం ఆరంభించారు. కారణం ఆమె ఎవ్వరిని ఖాతరు చేయక ముక్కు సూటిగా పోయే వ్యక్తి (అందుకే నేటికీ తమిళదేశంలో పెంకితనంతో వ్యవహరించే ఆడపిల్లలను 'రాణీ మంగమ్మ' అని అంటుంటారు.)

ఆమె కొలువులోని కొందరు మంగమ్మ మనమడు విజయరంగ ముద్దు చొక్కనాథునితో మంగమ్మ శీలం మంచిది గాదనీ, దళవాయి నరసప్పతోనూ, మంత్రి అచ్చయ్యతోనూ, మొగల్ సేనానితోనూ ఆమెకు అక్రమ సంబంధం వుందనీ కథలు కల్పించి చెప్పారు.

ఆవేశమే తప్ప ఆలోచన ఎరుగని వయసు. తను విన్న కథలు నిజమని నమ్మి విజయరంగ ముద్దు చొక్కనాథుడు రాణీమంగమ్మను ఆమె భవనంలోనే నిర్బంధించి బాధించాడు.

కొందరు చరిత్రకారులు ఆమె ఆ బాధలకు తాళలేక ఆత్మహత్య చేసుకున్నదని అంటారు. కానీ మరి కొందరు మతి భ్రమించి మరణించిందంటారు. కానీ ఆ కాలంలో ఆమెకు సాటి ఎవ్వరూ లేరని చరిత్రకారులందరూ అంగీకరించారు!

—సి. హెచ్. ఇంద్రాణి